క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్షతో నూతన అధ్యాయం



చిలకలపూడి(మచిలీపట్నం): శనివారం నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నూతన అధ్యాయాన్ని సృష్టిస్తోందని, ఇలాంటి కార్యక్రమం రాష్ట్రంలో, దేశస్థాయిలో ఎన్నడూ జరగని రీతిలో నిర్వహించి విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి. రాజాబాబు, జేసీ అపరాజితసింగ్, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డీఆర్వో పి. వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి. గీతాబాయి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశాలత, డీఎల్‌డీఓ సుబ్బారావు పాల్గొన్నారు.

9 పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

అవనిగడ్డ: అవనిగడ్డ డిపో నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని 9 పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్‌ను నడుపుతున్నామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. బ్రహ్మంగారి మఠం, మహానంది, అహోబిలం, యాగంటి, అలంపూర్, మంత్రాలయం, శ్రీశైలం, త్రిపురాంతకం, కోటప్పకొండ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేలా ప్రత్యేక బస్సు సర్వీసును ప్రవేశ పెట్టామని చెప్పారు. అక్టోబర్ 12వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు అవనిగడ్డ నుంచి కొత్త సూపర్ లగ్జరీ బస్ సర్వీసు ప్రారంభమవుతుందన్నారు.

చల్లపల్లి చేరుకున్న బైక్ ర్యాలీ

చల్లపల్లి: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు కేఏ ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన యూటీఎఫ్ రాష్ట్ర నాయకుల బైక్ ర్యాలీ శుక్రవారం మధ్యాహ్నం చల్లపల్లి చేరుకుంది. స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి సభలో వారు మాట్లాడారు. అక్టోబర్ ఒకటిన కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, సంఘ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

జగనన్న భూ హక్కు రీసర్వేపై అవగాహన

ఘంటసాల(అవనిగడ్డ): భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన జగనన్న భూ హక్కు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి. రామానాయక్ అన్నారు. దాలిపర్రులో జగన్న శాశ్వత భూ హక్కు రీ సర్వేపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమం మండలంలో వేగవంతంగా జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ డోకి పర్తి శాంతకుమారి, పలువురు రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

అవనిగడ్డ: అక్టోబర్ 1వ తేదీన విజయవాడలో నిర్వహించే ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని గ్రేడ్-2 వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రా నాగరాజు కోరారు. శుక్రవారం ఆయన ఘంటసాలలో విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రంలో ఆదర్శ పాలన

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- గ్రామ సచివాలయం, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ప్రారంభం



సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోసూరువారిపాలెం(మోపిదేవి): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన చేస్తున్నారని, ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండలంలోని కోసూరువారిపాలెంలో రూ. 23.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, ప్రతిపక్షాలకు అడిగేందుకు ఏమీలేక విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నందుకు అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. జగనన్న బటన్ నొక్కితే అర్హత ఉన్న పేదవాడికి చేరుతుందని, అదే చంద్రబాబు బటన్ నొక్కితే కార్పొరేట్ సంస్థల్లోకి చేరి అక్కడి నుంచి డొల్ల కంపెనీల ద్వారా మళ్లీ బాబు జేబుల్లోకి చేరుతుందని ఎద్దేవా చేశారు. 27 శాతం ఉన్న కాపు సామాజిక వర్గాన్ని టీడీపీ కాళ్ల వద్ద పవన్ కల్యాణ్ పెడుతున్నాడని, పవన్ కల్యాణ్ ఆలోచించాలని సూచించారు.

రైతులకు న్యాయం చేశాం..

గతంలో టీడీపీ రైతుల భూములను 22ఎ కింద చేర్చి వారి నడ్డి విరిచిందన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత 22ఎ తొలగించి దివిసీమలోనే 17,780 ఎకరాలకు సంబంధించి 10,116 మంది రైతులకు హక్కు కల్పించి పూర్తి న్యాయం చేశామని గుర్తుచేశారు. దాలిపర్రు వద్ద ఎత్తిపోతల పథకానికి గత ప్రభుత్వం రూ. 12.26 కోట్లతో అంచనాలు రూపొందించి కాలయాపన చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. మన ప్రభుత్వంలో కేవలం రూ. 66 లక్షలతో సమస్య పరిష్కరించి రైతులకు న్యాయం చేశామన్నారు. 10 వేల మంది జనాభా ఉన్న ఎదురుమొండి దీవుల బ్రిడ్జికి ఇప్పటికే టెండర్ పిలిచామని, కోడూరు అవనిగడ్డ రోడ్డు సమస్య కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఏడు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడే బొబ్బర్లంక వద్ద బ్యారేజీ నిర్మాణానికి మట్టి నమూనా, అంచనాలు పూర్తయ్యాయని, ప్రాధాన్యతా క్రమంలో వాటి పనులు జరుగుతాయని వివరించారు. జీఎస్టీ ఎగవేసినందుకు చంద్రబాబును అరెస్ట్ చేశారని, దీనికి ఆర్థిక సంపన్నులు ఇతర రాష్ట్రాల్లో ఉద్యమాలంటూ హడావుడి చేసినా రాష్ట్రంలో ఆయనపై ఎలాంటి సానుభూతి లేదన్నారు. సంక్షేమ పథకాలు మరోసారి అమలు చేసేందుకు జగనన్నను గెలుపించుకోవాలని కోరారు. అనంతరం వైఎస్సార్ ఆరోగ్య కేంద్రానికి స్థలం ఇచ్చిన దాత బడే రామకృష్ణారావును ఘనంగా సన్మానించారు.

సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్ బాబు, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు కోసూరు కోటేశ్వరరావు, ఆది రాంబాబు, గరికిపాటి గోవిందరాజులు, మత్తి వెంకట సత్యనారాయణ, లింగం జగదీష్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ రాజాబాబు
- క్లాప్‌మిత్రలకు సన్మానం



సన్మానం పొందిన కార్మికులతో కలెక్టర్ రాజాబాబు, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కలెక్టర్ రాజాబాబు కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల చెత్తను రోడ్లపై వేస్తున్నారని, దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్ని గ్రామాల్లో చెత్తను వేయడానికి స్థలాలు ఉన్నాయి.. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తున్నారా లేదా అనే వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ డీపీఓకు సూచించారు. చెత్త నిర్వహణపై ప్రణాళికను రూపొందించి అందులో పారిశుద్ధ్య కార్మికులను భాగస్వామ్యం చేయాలన్నారు. స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 25 మండలాల్లో 50 మంది కార్మికులను గుర్తించి వారికి సన్మానం చేయటంతో పాటు పది కిలోల బియ్యం, రెండు కిలోల కందిపప్పు, కేజీ నూనె ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో పి. వెంకట రమణ, డీపీఓ నాగేశ్వరనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, డీఎల్‌పీఓ కిరణ్మయి పాల్గొన్నారు.

సామూహిక మణిదీపేశ్వరి పూజ



మణిదీపేశ్వరి సామూహిక పూజలో మహిళలు

నాగాయలంక: గ్రామంలోని ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం పన్నెండో రోజుకు చేరాయి. ఉత్సవ వేదికపై అంబా సాయికిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో సువాసినీలచే మణిదీపేశ్వరి (భువనేశ్వరి) స్తోత్ర పారాయణం, సామూహిక పూజ నిర్వహించారు. ప్రధాన పీఠం వద్ద ఆర్యవైశ్య ప్రముఖుడు కొల్లూరు ఆంజనేయులు దంపతులచే పూజా క్రతువు నిర్వహించగా 80 మంది మహిళలు సామూహిక పూజలో పీటలపై కూర్చున్నారు. చిట్టా వాణి నేతృత్వంలో సంకర్షణ భజన మండలి సభ్యులు మణిదీపేశ్వరి పారాయణం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం జగిత్యాలకు చెందిన వి.నాగరాణి భాగవతారిణి గానం చేసిన సతీ అనసూయ హరికథ అలరించింది. తొలుత ప్రసన్న గణపతి స్వామివారి సన్నిధిలో లక్ష్మీగణపతి హోమం, నిత్య వినాయక పూజా కార్యక్రమాలు జరిగాయి.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం బంటుమిల్లి రోడ్డులోని పెడన ఫంక్షన్‌హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్షపై గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద ప్రతి సచివాలయం పరిధిలో వైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఆపరేషన్లు అవసరమైన వారికి వైఎస్సార్ సీపీ శ్రేణులు అండగా నిలిచి ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు చేయించాలన్నారు. పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల ఎంపీపీలు వాణి, మధుసూదనరావు, చినబాబు, గరుడప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, జెడ్పీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మోపిదేవి పీహెచ్‌సీ డాక్టర్ ఎల్. లక్ష్మీనాథ్ అన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు కొక్కిలిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. గ్రామాల్లో స్పెషలిస్టు డాక్టర్లతో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. ఇప్పటికే గ్రామ వలంటీర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించి వారికి టోకెన్లు ఇచ్చారని చెప్పారు. సర్వే సమయంలో ఇంటి వద్ద లేని వారు కూడా శిబిరాన్ని ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. మండలంలో శిబిరం వివరాలు ఇలా ఉన్నాయి. అక్టోబర్ 3వ తేదీన అడపావారిపాలెంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద, 4న ఉత్తర చిరువోలులంక ఎంపీయూపీ స్కూల్ వద్ద, 5న పెదప్రోలు జెడ్పీ హైస్కూల్ వద్ద, 6న మోపిదేవి జెడ్పీ హైస్కూల్ వద్ద, 7న కె. కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద, 9న మెరకనపల్లి ఎంపీపీ స్కూల్ వద్ద, 10న వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ వద్ద, 11న నాగాయితిప్ప ఎంపీయూపీ స్కూల్ వద్ద, 12న కోసూరువారిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శిబిరాలు జరుగుతాయన్నారు.

నేడు పల్లెపాలెం జెడ్పీ స్కూల్‌లో..

కృత్తివెన్ను: మండల పరిధిలోని పల్లెపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ పిచ్చిబాబు, వైద్యులు అల్తాఫ్ హుస్సేన్, సందీప్, సర్పంచు కె. రాజులతో కలిసి పాఠశాలలో శిబిరం ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కోడూరు: మండలంలోని రామకృష్ణాపురం సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని, ప్రజలు ఈ శిబిరంలో తమ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయని కమిషనర్ జి. చంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రైలుపేటలోని మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో 12 వార్డుల వారికి శిబిరం నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 3వ తేదీన నారాయణపురం తుపాను షెల్టరులో, 5న చిలకలపూడి పాండురంగ మునిసిపల్ హైస్కూల్‌లో, 7న వల్లెగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో, 17న శారదా నగర్ కొత్త అర్బన్ హెల్త్ సెంటర్‌లో, 21న బందరుకోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు.

బంటుమిల్లిలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం



బంటుమిల్లిలో చెరువులా మారిన మచిలీపట్నం జాతీయ రహదారి

బంటుమిల్లి: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులకు గురైన ప్రజలు వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో సేదతీరారు. ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం నల్లని మేఘాలు కమ్ముకుని ఎడతెరిపి లేకుండా రెండు గంటలపాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. స్థానిక బీఎస్‌ఆర్ కాలనీ, శివ గణేష్ కాలనీ, బీసీ కాలనీలోని వీధులు జలమయమయ్యాయి కాలనీల్లో అంతర్గత డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు, వర్షం నీరు కలిసి రోడ్లపై పారింది.

బంటుమిల్లి-మచిలీపట్నం జాతీయ రహదారిలో వర్షం నీటితో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షం రైతులకు మేలు చేస్తుందని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. గత కొన్ని రోజులుగా పంట కాలువలకు వారబందీ క్రమంలో నీరు విడుదల చేశారు. కాలువ నీటికి వర్షం తోడవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాలుడిని చితకబాదిన టీచర్.. కేసు నమోదు

కోనేరుసెంటర్: రెండో తరగతి చదువుతున్న బాలుడిని విచక్షణా రహితంగా చితకబాదిన ఉపాధ్యాయిపై కేసు నమోదైంది. ఇనగుదురుపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం రాజుపేటలోని నూరీనగర్‌కు చెందిన షేక్ సిద్దిక కుమారుడు చెంపాచెరువు మునిసిపల్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తోటి పిల్లలతో కలిసి క్లాసులో ఆటలాడుతున్న పిల్లాడిని ఉపాధ్యాయిని నాగపావని స్కేల్‌తో విచక్షణారహితంగా కొట్టింది. నొప్పి భరించలేని పిల్లాడు ఇంటికి వెళ్లి ఏడుస్తుండటంతో తల్లి షేక్ సిద్దిక జరిగిన విషయం తెలుసుకుని పాఠశాలకు వెళ్లి సదరు ఉపాధ్యాయినిని నిలదీసింది. ఉపాధ్యాయిని నాగపావని పర్సులో నుంచి రూ. 500 తీసి షేక్ సిద్దికకు ఇచ్చి వైద్యం చేయించుకోమని చెప్పింది. పిల్లాడి తల్లి ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నాగపావనిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గూడూరు: సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆచార్య దేవో భవ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8,9,10 తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు గురువుల గొప్పతనాన్ని వివరించారు. ఉపాధ్యాయులు టి.ఖాదర్‌మస్తాన్, పి.వెంకటేశ్వరమ్మ, మత్తి అరుణ, కేఎస్ఎన్‌మూర్తి పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

ఏడీఏ జయప్రద

అవనిగడ్డ: ప్రతి రైతూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ జేఎస్ జయప్రద అన్నారు. మండల పరిధిలోని పలు ఆర్‌బీకేలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఎరువుల నిల్వలు, విక్రయాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చల్లపల్లి: వ్యాపారులు ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సాయిసింధు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎరువులు, యూరియా దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా స్టాక్, ధరల పట్టీని పరిశీలించారు. ఎరువుల వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

వీరా మహేష్‌కు డాక్టరేట్



కోనేరుసెంటర్: బయోసైన్సెస్,బయోటెక్నాలజీ విభాగం నుంచి కృష్ణా యూనివర్సిటీ పరిశోధన విద్యార్థి వీరా మహేష్‌కు డాక్టరేట్ లభించింది. కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఎస్తేరు ఆధ్వర్యంలో జరిగిన మౌఖిక పరీక్ష, సమ్మతిలో మహేష్‌కు డాక్టరేట్ డిగ్రీని ప్రతిపాదించగా శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. తరిగిపోతున్న పిచ్చుకలను కృత్రిమ ఆవాసాల ద్వారా తిరిగి పెంపొందించడం అనే అంశంపై మహేష్ చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించింది. ఈ పరిశోధనకు కృష్ణా విశ్వవిద్యాలయం బయోసైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లంకా సుశీల మార్గదర్శకం వహించారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి. జ్ఞానమణి, రిజిస్ట్రార్ డాక్టర్ పి. వీరబ్రహ్మచారి, డీన్ ఆఫ్ సైన్సెస్ డాక్టర్ ఎం. బసవేశ్వరరావు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ నవీన లావణ్య తదితరులు మహేష్‌ను అభినందించారు.

యూరియా కొరత లేదు

నాగాయలంక ఏఓ

నాగాయలంక: మండలంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి ఎ.సంజీవరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని ఆర్‌బీకే, పీఏసీఎస్‌లలో యూరియాను ఎంఆర్‌పీ రూ.266లకే విక్రయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రిటైల్ ఎరువుల డీలర్లు ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదుకు శనివారంతో గడువు ముగుస్తుందని, నమోదు కాని వారు వెంటనే నమోదు చేయించుకోవాలన్నారు.

గూడూరులో 'మేరీ మిట్టి-మేరా దేశ్'

గూడూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మేరీ మిట్టి- మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను చేత పట్టుకుని విద్యార్థులు గ్రామ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలశంలో మట్టి సేకరించి ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత, ఎంఈఓలు ఎం.శేఖర్‌సింగ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోండి

పెడన: నేషనల్ మీన్ కం మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నవంబర్ 30వ తేదీలోగా ఆధార్ కార్డులోను, బ్యాంకు పాస్‌పుస్తకంలో ఉన్న విధంగానే ఒక్క అక్షరం తేడా లేకుండా పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థి వివరాలను సంబంధిత స్కూల్ నోడల్ అధికారులు డిసెంబర్ 15 లోగా క్షుణ్ణంగా పరిశీలించి, స్కూల్ నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు. పోర్టల్ అప్లికేషన్, ధ్రువీకరించిన పత్రాలను విద్యార్థులు మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిసెంబర్ 30వ తేదీ లోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ప్రగతిపథంలో సహకార సంఘాలు

మంగళాపురం(చల్లపల్లి): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రోత్సాహంతో గ్రామాల్లో సహకార సంఘాలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయని ఎమ్మె ల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పీఏసీఎస్ ఆవరణలో సొసైటీ మహాజన సభ, డివిడెంట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని 721 మంది సొసైటీ సభ్యులకు ఏడు శాతం చొప్పున రూ.8,37, 531 పంపిణీ చేశారు. సొసైటీ సభ్యుడు కొలుసు గోవిందరాజులు ఇటీవల మృతిచెందగా అతని భార్య విజయలక్ష్మికి రూ.లక్ష క్లెయిమ్ చెక్కు అందచేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మంగళాపురం(చల్లపల్లి): రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మంగళాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్ పోటీలకు పి.జస్వంత్, బేస్ బాల్ పోటీలకు పి. బాల సుబ్రహ్మణ్యం, కె.దినేష్ ఎంపికయ్యారు. గుడివాడలో జరిగిన జిల్లా జట్ల ఎంపికలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరాంజనేయులు, పీఈటీ రామకృష్ణ అభినందించారు.

3న వాసవిలో పాలిసెట్ తక్షణ ప్రవేశాలు

పెడన: పెడన మండలం నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబర్ మూడో తేదీన అర్హులైన వారికి తక్షణ ప్రవేశాలు కల్పిస్తామని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీకే ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, మెకానికల్, ఈసీఈ బ్రాంచ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు అక్టోబర్ 3లోగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: పెడన కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగే సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 11 అంశాలపై చర్చించి ఆమోదిస్తారని చెప్పారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

నడకుదురు(చల్లపల్లి): కృష్ణానది తీర గ్రామాల వాహనదారుల సౌకర్యార్థం కరకట్ట పక్కన నూతన పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం నడకుదురులో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వేమూరి గోవర్ధనరావు, సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, బంక్ నిర్వాహకులు పెనుమత్స రంగారావు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు, నిమజ్జనాలు

బంటుమిల్లి: బంటుమిల్లి గ్రామంలో శుక్రవారం పలు గణేష్ ఉత్సవ పందిళ్ల వద్ద అన్నసమారాధన, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆంధ్రా బ్యాంకు సెంటర్‌లో లక్ష్మీ గణపతి మోటారు ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన గణనాథుడిని గ్రామంలో ఊరేగించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. స్థానిక రజక వీధిలో యువ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరి వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను శుక్రవారం సాయంత్రం మోపిదేవి వార్పు వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. తొలుత గణేశుని విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. మహిళా భక్తులు గణేశునికి హారతులు అందించి ప్రసాదాలు స్వీకరించారు.

చిత్తులాడుతున్న ఏడుగురి అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల జగనన్న కాలనీలో చిత్తులాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. చిత్తులాట సమాచారం అందుకుని దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.4,050 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ప్రకటన

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు



మాకు అత్యంత ఆప్తులు, మా శ్రేయోభిలాషి ... గారు అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి వర్యులు ... చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయి అవార్డు అందుకున్న శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ...

భార్య : చలమలశెట్టి అరుణకుమారి
అక్క-బావ : నందం సులోచన - సాయిబాబు
చెల్లెలు - బావ : చిలంకుర్తి రాజ్యలక్ష్మి - భాస్కరరావు
సోదరుడు - మరదలు : చలమలశెట్టి శివరామకృష్ణ - సరస్వతి ప్రసన్న
మరియు కుటుంబ సభ్యులు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983, 99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com